శ్మశాన వాటికల్లో సౌకర్యాలేవి?

- గ్రామాల్లోని వైకుంఠధామాల్లో వసతులు కరువు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- నీటి సౌకర్యం, స్నానాల గదులు ఏర్పాటు చేయాలని వినతి



14వ డివిజన్ లక్ష్మీపురం గ్రామంలోని వైకుంఠధామం

ఫెర్టిలైజర్‌సిటీ: వైకుంఠధామాల నిర్మాణంలో కార్పొరేషన్ పరిధిలోని గ్రామాలకు శాపంగా మారింది. రామగుండం కార్పొరేషన్ పరిధిలో ఉన్న గ్రామాల్లో వైకుంఠధామాల నిర్మాణం కోసం నిధుల కేటాయింపుపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు ప్రభుత్వం వైకుంఠధామాలకు నిధులు మంజూరు చేసింది. జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో సుమారు 90శాతం వైకుంఠధామం నిర్మాణ పనులు పూర్తయ్యాయి. కానీ రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ లక్ష్మీపురంలో వైకుంఠధామం నిర్మాణం నాలుగేళ్లయినా నిర్మాణ పనులు కొంతమేర చేసి వదిలేశారు. లక్ష్మీపురంలో కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన వైకుంఠధామంలో స్నానాలు చేసేందుకు బోరు, ఇతర సౌకర్యాలు లేకపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. నీటి సౌకర్యం లేకపోవడంతో దహన సంస్కారాల అనంతరం స్నానం చేసేందుకు రూ.వెయ్యి చెల్లించి నీటి ట్యాంకర్ల ద్వారా నీరు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొందని గ్రామస్తులు వాపోతున్నారు.

కార్పొరేషన్ పరిధిలోని గ్రామాల్లో నిర్లక్ష్యం..

రామగుండం కార్పొరేషన్ పరిధిలోని గోదావరిఖని గోదావరినది ఒడ్డున గల హిందూ శ్మశానవాటిక, ఫైవింక్లయిన్ ఏరియాలో ముస్లిం శ్మశానవాటిక, గోదావరిఖని బస్టాండ్ ఎదుట క్రిస్టియన్ శ్మశాన వాటికలు ఉన్నాయి. దూరం ఎక్కువగా ఉండడంతో కార్పొరేషన్ పరిధిలోని గ్రామాల ప్రజలు రాలేకపోతున్నారు. కార్పొరేషన్ పరిధిలోని లక్ష్మీపురం, వీర్లపల్లి, న్యూమారేడుపాక శ్మశాన వాటికలకు కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిధులు కేటాయించడంలో నిర్లక్ష్యం వహించడంతో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయి. అధికారులు స్పందించి గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న శ్మశాన వాటికలకు నిధులు కేటాయించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

బోరు ఏర్పాటు చేయాలి



లక్ష్మీపురంలో నిర్మిస్తున్న వైకుంఠధామం నిర్మాణ పనులు నాలుగేళ్లయినా ముందుకు కదలడం లేదు. కార్పొరేషన్‌లో ఉండటమే మా గ్రామానికి శాపంగా మారింది. అధికారులు స్పందించి లక్ష్మీపురంలో ఏర్పాటు చేసిన శ్మశాన వాటికలో బోరు ఏర్పాటు చేయాలి. మహిళలు స్నానం చేసేందుకు గదులు నిర్మించాలి. **– మిట్టపల్లి మాధవరావు, లక్ష్మీపురం**

నిధులు కేటాయించాలి



లక్ష్మీపురంలోని వైకుంఠధామానికి నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలి. శ్మశాన వాటికలో అంత్యక్రియల అనంతరం స్నానం చేసేందుకు నీళ్లు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. రామగుండం ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ చూపించి శ్మశాన వాటికలో బోర్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలి.
– తాటికొండ రాజబాబు, లక్ష్మీపురం

వైకుంఠధామం పరిశీలిస్తాం



రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ లక్ష్మీపురం గ్రామంలోని వైకుంఠధామం సౌకర్యాలపై మా దృష్టికి రాలేదు. గ్రామంలోని వైకుంఠధామాన్ని పరిశీలిస్తాం. ప్రజలకు ఇబ్బంది కలగకుండా శ్మశాన వాటికలో సౌకర్యాలు కల్పనకు చర్యలు చేపడతాం.
– అరుణశ్రీ, రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్ఏసీ)

ధాన్యం డబ్బుల చెల్లింపులో జాప్యంపై నిరసన



పుట్నూర్ ఐకేపీ కేంద్రంలో రైతుల నిరసన

పాలకుర్తి: ధాన్యం అమ్మకాలు జరిపి 20రోజులు దాటినా ఇంకా తమ ఖాతాల్లో డబ్బులు జమ కావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పుట్నూర్ గ్రామంలో గురువారం రైతులు ఐకేపీ కేంద్రంలో నిరసన తెలిపారు. కేంద్రం ప్రారంభించి నెలరోజులు గడుస్తున్నా ఇంకా కేంద్రంలో ధాన్యం నిల్వలు ఉన్నాయి. సన్నరకం ధాన్యాన్ని మిల్లర్లు కొనడం లేదని, మూడు, నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ధాన్యంలో తేమశాతం ఎక్కువగా ఉంటోందని, ఆరబోద్దామంటే వాతావరణం సహకరించడం లేదని అన్నదాతలు వాపోయారు. మరోవైపు అమ్మకాలు పూర్తయినా రైతులకు సకాలంలో ధాన్యం డబ్బులు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు, పాలకులు చొరవ చూపి ధాన్యం డబ్బులు అకౌంట్లలో త్వరగా జమయ్యేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

వారంలోగా పూర్తిస్థాయి చెల్లింపులు

ప్రస్తుత సీజన్‌లో ఆశించిన దానికంటే అధిక దిగుబడి వచ్చింది. రైతులు సాగుచేసిన భూములు ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోకపోవడం కూడా సమస్యగా మారింది. వీటితో పాటు కౌలురైతులు సకాలంలో తమ భూముల వివరాలు అందజేయడం లేదు. వీటన్నింటి కారణంగా డబ్బుల చెల్లింపుల్లో జాప్యమవుతోంది. వారంలోగా ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యం డబ్బులు పూర్తిస్థాయిలో చెల్లింపులు జరిగేలా చర్యలు చేపడుతున్నాం.
– రమణ, సీఈవో, మేడిపల్లి సింగిల్‌విండో

సంక్షిప్త వార్తలు

• స్పిన్నింగ్ మిల్ కార్మికుల సమస్య పరిష్కారం

గోదావరిఖని: అంతర్గాం స్పిన్నింగ్ మిల్లు కార్మికులు, కాందిశీకులకు ఇళ్ల పట్టాల సమస్య పరిష్కారం దిశగా కీలక పురోగతి సాధించినట్లు రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి, రాష్ట్ర ప్రధాన భూ పరిపాలన కమిషనర్ నవీన్ మిట్టల్‌తో సమస్యపై చర్చించినట్లు తెలిపారు.

• పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ

పాలకుర్తి: మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో గురువారం రైతులకు మండల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పచ్చిరొట్ట ఎరువు విత్తనాలు పంపిణీ చేశారు. పుట్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గాలిపెల్లి తిరుపతి, మండల వ్యవసాయాధికారి ప్రమోద్‌కుమార్, ఏఈవోలు శశిధర్, యోజన, సుష్మ పాల్గొన్నారు.

• విద్యుత్ తీగలు తాకి ఐదు మేకలు మృతి

రామగిరి: మండలంలోని రత్నాపూర్ శివారులో గురువారం సాయంత్రం గాలివానకు విద్యుత్ తీగలు తెగిపడడంతో ఐదు మేకలు మృతి చెందాయి. పన్నూర్ గ్రామానికి చెందిన కాపరులు రత్నాపూర్ శివారులో మేకలు మేపుతుండా గాలికి విద్యుత్ తీగలు తెగిపడి వాటిపై పడడంతో ఐదు మేకలు మృతి చెందాయి. నష్టపరిహారం అందించాలని మేకల కాపరులు వేడుకుంటున్నారు.

• కారులో మంటలు.. తప్పిన ప్రమాదం

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ పోతన కాలనీ రైల్వే గేట్ ప్రధాన చౌరస్తా సింగరేణి కోల్ కారిడార్ మార్గంలో గురువారం రాత్రి పోతన కాలనీ ప్రధాన చౌరస్తా వద్ద గోదావరిఖని వైపు వెళ్తున్న ఓ కారులో నుంచి ఒక్కసారిగా పొగ, మంటలు వచ్చాయి. కారులో ఉన్న వ్యక్తులు గమనించి కారును రోడ్డుపై ఆపి వెంటనే బయటకు వచ్చారు. అక్కడే ఉన్న స్థానికుల సాయతో వాటర్ చల్లడంతో మంటలు ఆరిపోయినట్లు స్థానికులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం కాల్వశ్రీరాంపూర్ నుంచి వస్తున్న కారు వర్షం పడుతుండగానే షాట్ సర్క్యూట్‌తో కారులో నుంచి మంటలు వచ్చినట్లు పేర్కొన్నారు. సకాలంలో మంటలు ఆర్పివేయడంతో ప్రమాదం తప్పిందన్నారు.

• ఎంపీపై వివక్ష హేయమైన చర్య

ఓదెల: కాళేశ్వరంలో నిర్వహిస్తున్న సరస్వతి పుష్కరాల్లో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణపై వివక్ష చూపటం హేయమైన చర్య అని కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు, మడక మాజీ ఎంపీటీసీ ఆవుల ముక్తేశ్వర్ అన్నారు. ఓదెలలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సరస్వతి నది పుష్కరాలకు ఎంపీకి ఆహ్వానం లేకపోవడంతో పాటు ఫ్లెక్సీలో ఫొటో ఏర్పాటు చేయకపోవటం దారుణమన్నారు. ఎంపీ ప్రొటోకాల్ విషయంపై రాష్ట్రపతి దృష్టికి తీసుకెళ్తామని ఆయన తెలిపారు.

• గుండెపోటుతో పారిశుధ్య కార్మికుడు మృతి

కమాన్‌పూర్: మండలంలోని రొంపికుంట గ్రామ పంచాయతీలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్న పులిపాక మొండయ్య(68) గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. మొండయ్య ఉదయం గ్రామంలో పారిశుధ్య పనులు చేస్తుండగా గుండెపోటు రావడంతో మృతి చెందాడు. మొండయ్య నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేయడానికి అంగీకరించగా నేత్రాలను హైదరబాద్‌లోని ఎల్వీ ప్రసాద్ ఐబ్యాంకుకు తరలించారు.

• ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణ సందర్శన

ధర్మారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మూడురోజులుగా జరుగుతున్న ఉపాధ్యాయ వృత్యంతర శిక్షణను ప్రిన్సిపాల్ డీఆర్పీలు అనంత రామకృష్ణ, జిల్లా రిసోర్స్ పర్సన్ ప్రభాకర్ రెడ్డి సందర్శించారు. కార్యక్రమ నిర్వహణ తీరును, ఏర్పాట్లను పరిశీలించారు. మండల విద్యాధికారి పోతు ప్రభాకర్, రిసోర్స్ పర్సన్లు గుర్రాల గంగారెడ్డి, గంకిడి వెంకటరమణారెడ్డి, జాడి శ్రీనివాస్, హైమావతి, సిరిపురం సునీల్, ఈగం సంతోష్, సతీశ్, జలపతిని సన్మానించారు.

• ఉపాధ్యాయుల శిక్షణ పరిశీలన

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో ఎంఈవో, కోర్స్ డైరెక్టర్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా రిసోర్స్ పర్సన్ ఈర్ల సమ్మయ్య గురువారం పరిశీలకులుగా హాజరై శిక్షణ తీరును పరిశీలించారు.

• రైతులు ముందస్తు సాగుకు సిద్ధం కావాలి

రామగుండం: రైతులు గతంలో కంటే ముందస్తుగా సాగుకు సిద్ధం కావాలని, దీంతో చివరి దశలో అకాల వర్షాలతో జరిగే నష్టాన్ని నివారించే వీలుంటుందని అంతర్గాం మండల వ్యవసాయాధికారి కె.సతీశ్ అన్నారు. అంతర్గాం మండల పరిధిలోని పెద్దంపేట రైతులకు గురువారం ముందస్తు సాగుపై అవగాహన కల్పించారు. ఏఈవోలు హరీశ్, రమేశ్ పాల్గొన్నారు.

• ఇందిరమ్మ ఇళ్ల పత్రాల పంపిణీ

జూలపల్లి: మండలంలోని వడ్కాపూర్‌కు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను ధూళికట్ట సింగిల్‌విండో చైర్మన్ పుల్లూరి వేణుగోపాలరావు లబ్ధిదారులకు అంఅందజేశారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్లు సంతోష్, నాయకులు సమ్మయ్య, సంపత్, రమాదేవి, సంపత్, లక్ష్మి, గట్టయ్య, లింగయ్య, కనుకయ్య, నర్సింగం, రాజేందర్ పాల్గొన్నారు.

• మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలపై అవగాహన

సుల్తానాబాద్‌రూరల్: మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలను విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని సుల్తానాబాద్ ఎక్సైజ్ సీఐ గురునాథ్ అన్నారు. మండలంలోని గర్రెపల్లి మోడల్ స్కూల్ ఆంగ్ల ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం జరుగుతున్న నేపథ్యంలో మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలపై టీచర్లకు సీఐ అవగాహన కల్పించారు.

సన్మానం



మిస్ వరల్డ్-2024 క్రిస్టినా పిజ్కోవాను సన్మానిస్తున్న రష్మీఠాకూర్

జ్యోతినగర్: మిస్ వరల్డ్ బ్యూటీ కాంటెస్ట్ పోటీదారులను ఎన్టీపీసీ రామగుండంకు చెందిన మిస్ ఆసియా ఇంటర్నేషనల్ ఇండియన్ హ్యాండ్‌లూమ్ బ్రాండ్ అంబాసిడర్ రష్మీఠాకూర్ గురువారం హైదరాబాద్‌లో సన్మానించారు.

మావోయిస్టు నేతల హత్యను ఖండించాలి



నిరసన ప్రదర్శనలో నాయకులు

గోదావరిఖని: మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతో పాటు 28 మందికిపైగా మావోయిస్టులను కేంద్రం ఎన్‌కౌంటర్ పేరుతో హత్య చేయడాన్ని ప్రజాస్వామ్య వాదులంతా ఖండించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఐ.కృష్ణ పిలుపునిచ్చారు. స్థానిక ప్రధాన చౌరస్తాలో గురువారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఆపరేషన్ కగార్ వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. నాయకులు ఇ.నరేశ్, బిఅశోక్, చిలుక శంకర్, ఐ.రాజేశం, కొల్లూరి మల్లేశ్, మెరుగు చంద్రయ్య, పైడిపల్లి రమేశ్, ఎడ్ల రవికుమార్, ఆర్.రాయమల్లు, పి.మొండయ్య, ఎస్‌సీబాబు, బి.రాజనర్సు, ఐ.సాంబయ్య, ఎ.చంద్రయ్య, సదానందం పాల్గొన్నారు.


ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ల సమస్యలు పరిష్కరించండి

మంథని: ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఆకుల కిరణ్ అన్నారు. మంథని డివిజన్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఒప్పందం ప్రకారం ప్రతీ రెండేళ్లకు ఒకసారి వేతనాలు పెంచాల్సి ఉండగా యాజమాన్యం ఇప్పటి వరకు ఆ నిబంధనను పట్టించుకోలేదని అద్దె బస్సు డ్రైవర్ల యూనియన్ అధ్యక్షుడు కేతిరి మహేశ్ అన్నారు. అద్దె బస్సు ఓనర్లు చర్చలకు వచ్చి తమ న్యాయమైన డిమాండ్లు ఒప్పుకోకపోవడంతో తప్పనిసరి పరిస్థితిలో సమ్మెకు దిగాల్సి వచ్చిందన్నారు. ప్రధాన కార్యదర్శి సతీశ్, కోశాధికారి అప్సర్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ ఉన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

ఓదెల: మండలంలోని ఉప్పరపల్లె నుంచి గోపరపల్లె వరకు ఉపాధిహామీ పథకం కింద గురువారం రోడ్డుపనులు ప్రారంభమయ్యాయి.

వేసవి శిక్షణ శిబిరం సందర్శన



మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి మాధవి

మంథని: వేసవి సెలవుల సందర్భంగా నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాన్ని గురువారం జిల్లా విద్యాధికారి మాధవి సందర్శించారు. తెలుగు, గణిత విషయాల్లో బోధన, అభ్యసన ప్రక్రియలు తదితర అంశాలపై రిసోర్స్ పర్సన్‌లు వివరించారు. శిక్షణ కార్యక్రమాలను వినియోగించుకొని పాఠశాలలో మెరుగైన విద్యా ప్రమాణాలను పాటించాలని, అడ్మిషన్ల సంఖ్య పెంచాలని డీఈవో కోరారు. రిసోర్స్ పర్సన్లు ఎర్రం రమేశ్, ఈర్ల రమేశ్, బహుత్ కిషోర్, మద్ది రాము, లోకే రాజ్ పవన్, బొగే చంద్రశేఖర్, కోట లక్ష్మణ్, నారమల్ల లక్ష్మణ్, సీఆర్‌పీలు మల్లన్న, సుప్రజ, రాధిక, స్వప్న పాల్గొన్నారు.

క్లుప్తంగా

బదిలీపై వెళ్తున్న ఏసీపీకి సన్మానం



జ్ఞాపిక అందిస్తున్న సీపీ అంబర్‌కిషోర్‌ఝా

గోదావరిఖని: రామగుండం పోలీస్ కమిషనరేట్ స్పెషల్‌బ్రాంచ్ విభాగంలో ఏసీపీగా పనిచేసి బదిలీపై వెళ్తున్న రాఘవేంద్రరావును గురువారం సీపీ అంబర్‌కిషోర్‌ఝా సన్మానించారు. అలాగే బదిలీ అయిన సీఐ ప్రేమ్‌కుమార్‌ను కూడా సత్కరించారు. అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఫ్లెక్సీకి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

గోదావరిఖని: ఎమ్మెల్యే చొరవతోనే లారీల టోల్‌గేట్ చార్జీలు తగ్గాయని రామగుండం ఏరియా లారీ యాజమానుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కందూరు శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం అసోసియేషన్ కార్యాలయంలో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్, మంత్రి శ్రీధర్ బాబు, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలున్న ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. 12ఏళ్లుగా లారీలకు బసంత్‌నగర్ టోల్‌గేట్ నిర్వాహకులు అత్యధికంగా రూ.759 వసూలు చేస్తున్న విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా, హెచ్‌కేఆర్ యాజమాన్యం దిగివచ్చి రిటర్న్ లారీలకు రూ.152 మాత్రమే వసూలు చేసేందుకు ఒప్పుకుందన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఎమ్మెల్యేకు సంఘం కృతజ్ఞతలు తెలిపింది. నాయకులు బొంతల రాజేశ్, మహంకాళి స్వామి, తిప్పారపు శ్రీనివాస్, గట్ల రమేశ్, ఎండీ ముస్తఫా, తిరుపతి, కళ్యాణి సింహాచలం, ధూళికట్ట సతీశ్, వంశీ, లారీ యజమానులు పాండురంగారావు, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కల్వచర్ల రైతుకు వ్యవసాయరంగ అవార్డు



అవార్డు అందుకుంటున్న శ్రీనివాస్ తండ్రి రాజమల్లు

రామగిరి: వివిధ రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్న యవతను గుర్తించి ఏటా అందిస్తున్న జీఈఎంఆఫ్ అవార్డుకు మండలంలోని కల్వచర్లకు చెందిన యువ రైతు యాదగిరి శ్రీనివాస్ ఎంపికయ్యాడు. గురువారం ఢిల్లీలో మాజీ మంత్రి సోమనాథ్ భారత్, అభిషేక్ బచ్చన్ చేతుల మీదుగా అవార్డును శ్రీనివాస్ తండ్రి రాజమల్లుకు అందజేశారు.

‘నంబాల’ ఎన్‌కౌంటర్‌పై విచారణ జరిపించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: మావోయిస్టు పార్టీ కేంద్ర ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్ బూటకమని, ఈ ఘటనపై సుప్రీంకోర్టు జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని గురువారం ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని బస్టాండ్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరిట అడవుల్లో జీవించే ఆదివాసీలను మావోయిస్టుల పేరిట హతమారుస్తోందని పౌరహక్కుల సంఘ నాయకుడు మాదన కుమారస్వామి ఆరోపించారు. 2026 మార్చి నాటికి మావోయిస్టు ముక్త్ భారత్ పేరిట ఎన్‌కౌంటర్లను ప్రోత్సహిస్తోందన్నారు. నారాయణపూర్ అడవుల్లో మావోయిస్టు పార్టీ కేంద్ర ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతో పాటు 27మందిని ఎన్‌కౌంటర్ పేరిట హతమార్చారని ఆరోపించారు. కేంద్రం మావోలతో శాంతిచర్చలు జరపాలని, కేశవరావు ఎన్‌కౌంటర్‌పై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. నాయకులు మార్వాడి సుదర్శన్, మల్లన్న, బొంకూరి లక్ష్మణ్, బాలసాని రాజయ్య, బొడ్డుపల్లి రవి, సంపత్, పుల్ల సుచరిత, వినోద్, ఎరుకల రాజన్న, కొమురయ్య, మల్లేశం, రాజలింగు, రాజగోపాల్, శంకర్, లింగన్న ఉన్నారు.

అంతర్గాం ఎస్సైకి సన్మానం

రామగుండం: అంతర్గాం పోలీస్‌స్టేషన్‌కు సిటిజన్ ఫీడ్ బ్యాక్‌లో రాష్ట్రవ్యాప్తంగా మూడోర్యాంకు సాధించడంపై మండలంలో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. కాంగ్రెస్ మండల ప్రతినిధులు గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై బోయ వెంకటస్వామిని సన్మానించారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మడ్డి తిరుపతిగౌడ్, హన్మాన్‌రెడ్డి, శేఖర్, శ్రీకాంత్, మహిళా అధ్యక్షురాలు నాజియాసుల్తానా ఉన్నారు.

ఒక్క వానకే చిత్తడైన రామగుండం రైల్వేస్టేషన్



స్టేషన్ ప్రవేశద్వారం వద్ద భారీగా నిలిచిన వరద నీరు

రామగుండం: అమృత్ భారత్ పథకంలో భాగంగా రూ.26.49కోట్ల నిధులతో రామగుండం రైల్వేస్టేషన్‌ను ఆధునికీకరిస్తున్న క్రమంలో కనీసం ప్రారంభోత్సవం కాకముందే కాంట్రాక్టర్ల డొల్లతనం బయటపడింది. కాగా గురువారం మధ్యాహ్నం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి రైల్వేస్టేషన్‌లోని అన్ని ప్రదేశాలు వరద నీటితో ముంచెత్తాయి. రైల్వే కంట్రోల్ రూమ్, కార్యాలయంలోని వాష్‌రూంలో స్లాబ్‌పై నుంచి వరద నీరు లీకవుతోంది. రైల్వేస్టేషన్ ప్రవేశద్వారం వద్ద మోకాళ్ల లోతు వరద నీరు నిలిచింది. ఇదిలా ఉండగా రైల్వేస్టేషన్ పైన తెలుగు, ఇంగ్లీషు, ఉర్దూ భాషల్లో స్టేషన్ పేరుతో తయారు చేసిన బోర్డుల్లో ఇప్పటికే ఉర్దూ బోర్డు కూలిపోగా, మరో రెండు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. దీనిపై ఉన్నతస్థాయి విచారణ చేయించాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.

ఘనంగా హనుమాన్ జయంతోత్సవం



పెద్దపల్లిరూరల్: కొండగట్టు అంజన్న సన్నిధిలో ఎమ్మెల్యే విజయరమణారావు



జ్యోతినగర్: హనుమాన్ దీక్షాస్వాముల ర్యాలీ



యైటింక్లయిన్‌కాలనీ: పూజలో పాల్గొన్న భక్తులు



రామగుండం: భక్తాంజనేయస్వామి ఆలయంలో



కాల్వశ్రీరాంపూర్‌లో..



సుల్తానాబాద్‌రూరల్: చిన్నకల్వలలో..



సుల్తానాబాద్: హోమంలో పాల్గొన్న భక్తులు



ముత్తారం: మైదంబండలో..

జైశ్రీరాం.. జైబోలో హనుమాన్‌కీ నినాదాలతో గురువారం ఆంజనేయస్వామి ఆలయాలు మార్మోగాయి. హనుమాన్ జయంతి సందర్భంగా ఆలయాలను సుందరంగా ముస్తాబు చేశారు. పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల్లో హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. హనుమాన్ దీక్షస్వాములు హనుమాన్ విగ్రహాన్ని ఊరేగించారు.
– సాక్షి నెట్‌వర్క్

బీఆర్‌ఎస్ నేత భవనం కూల్చివేతకు యత్నం



భవనం కొంత భాగాన్ని కూల్చివేస్తున్న దృశ్యం

కోల్‌సిటీ: గోదావరిఖనిలో ఓ బీఆర్‌ఎస్ నేతకు చెందిన భవనాన్ని గురువారం రామగుండం నగరపాలక సంస్థ అధికారులు కొంత మేరకు కూల్చివేసే చర్యలు చేపట్టారు. స్థానిక కళ్యాణ్‌నగర్ కూడలిలో బీఆర్‌ఎస్‌కు చెందిన నడిపెల్లి మురళీధర్‌రావు భవనం ఉండగా, రోడ్డు విస్తరణకు కొంత వరకు అడ్డుగా ఉందని టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు గురువారం జేసీబీతో కూల్చివేతకు పూనుకున్నారు. ఉదయాన్నే కూల్చివేత ప్రారంభించడంతో చూసేందుకు జనం తరలివచ్చారు. పోలీసులు బందోస్తు నిర్వహించారు. దీంతో మురళీధర్‌రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాడు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా కూల్చివేతకు దిగడం బాధాకరమన్నారు. పది రోజులు గడువు ఇవ్వాలని బల్దియా స్పెషలాఫీసర్, కమిషనర్‌కు బుధవారం వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. ఇది కక్షసాధింపు చర్యలని, తనకు సుమారు రూ.20లక్షల నష్టం వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశాడు.

భాగ్యరెడ్డి వర్మ సేవలు స్ఫూర్తిదాయకం



సుల్తానాబాద్: మున్సిపల్ కార్యాలయంలో..



కోల్‌సిటీ: నివాళి అర్పిస్తున్న డిప్యూటీ కమిషనర్

సుల్తానాబాద్: భాగ్యరెడ్డి వర్మ సేవలు స్ఫూర్తిదాయకమని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ నియాజ్ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం భాగ్యరెడ్డి వర్మ జయంతి నిర్వహించారు.

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో భాగ్యరెడ్డివర్మ జయంతి గురువారం నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి, అధికారులు, సిబ్బంది ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. నగరపాలక సంస్థ అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీహరి, రెవెన్యూ అధికారి ఆంజనేయులు, అకౌంట్స్ ఆఫీసర్ రాజు, ఏఈ చంద్రమౌళి, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శంకర్‌రావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కుమారస్వామి, హెల్త్ అసిస్టెంట్ సంపత్, జూనియర్ అసిస్టెంట్ శంకర్‌స్వామి, మెప్మా టీఎంసీ మౌనిక పాల్గొన్నారు.

పహల్గాం ఘటనపై విచారణ జరపాలి

జ్యోతినగర్: పహల్గాం ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరపాలని, ఆపరేషన్ సింధూర్‌లో దాగి ఉన్న అసలు నిజాలతో అన్ని కోణాలను బహిర్గతం చేయాలని సీపీఐ(ఎంఎల్) ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు.